"అనిరుధ్... హేయ్... అనిరుధ్, గుడ్ మార్నింగ్ నిద్రలేవండీ...!"

పిల్ల తెమ్మెర గొంతు తేనెలో రంగరించి తీసినట్టు కమకమ్మని పిలుపు వినిపించింది. ఆ పిలుపు వినిపించినా – అందులో ధ్వనించే అత్యంత మధురిమను మరింతగా ఆస్వాదించాలనీ – ఆస్వాదించి అందులో మునకలేసి తరించాలనీ కాబోలూ కావాలని మగతగా అట్లాగే బెడ్‌పై ఉండిపోయేడు అనిరుధ్.

"ప్రియమైన వినియోగదారుడా – మేలుకో – తెల్లవారవచ్చే తెలియక నాసామీ...!" ఈసారి మాటలు మరింత దగ్గరగా దాదాపు చెవిలోనే అన్నట్టు వినిపించాయి. దాంతోబాటు అప్పుడే



# కావ్యనాయిక

స్నానించిన పరిమళాల ఉప్పెన! అన్నింటినీ మించి నిర్వచనాలకందని నవ వధువు సాన్నిహిత్యస్పర్శ అతడి మోముని ముద్దాడింది. కొసమెరుపుగా, తలస్నానం చేయడం వల్ల కాబోలు నీలాల శిరోజాలలో చేరి పునీతమైన జలస్ఫటికమొకటి – 'టప్'న రాలి అతడి ఫాలభాగాన్ని అలంకరించింది.

ఇక ఆగలేకపోయాడు అనిరుధ్. కళ్లు తెరవకుండానే రెండు చేతులూ చాచి భార్య నడుం చుట్టి మీదకులాక్కుని పరవశంగా "సిరీ...!" అంటూ పలవరించాడు. "కౌసల్యా సుప్రజా రామా – పూర్వాసంధ్యా ప్రవర్తతే–" మొగుడి చెవికొరికి సుప్రభాతం అందుకొంది సౌందర్య 'సిరి'.

"ధీరసమీరే – యమునాతీరే..." జయదేవుని అష్టపది అందుకొని ఆమెను కౌగిట్లో బంధించాడతడు.

"అయ్యో– ఇది ఉషోదయవేళ! జయదేవుని అష్టపది కాదు – సుప్రభాతం చదవాలి" ముద్దుగా గునిసింది.

"ఏం కాదూ – ఎప్పుడూ పాత పాటేనా – వెరైటీగా – గోపీ పీన పయోధర మర్దనే – పాడితే ఏమిటట?"

"ఛీ...ఛీ... నేను మడితో ఉన్నాను" మొగుడిని తోసేసింది సిరి.

"సిరీ... ప్లీజ్... ఒక్కసారి" అనిరుధ్ భార్యని ఒడిసి పట్టబోయాడు. అయితే ఆమె లేడిపిల్లను సైతం తృణీకరిస్తూ చెంగున ఎగిరి చేతికి చిక్కకుండా పారిపోయింది. అంతే...! 'దభ్' మని బెడ్ మీంచి క్రింద పడిపోయాడు మన్మథ పుత్రుడు – అదే... అనిరుధ్!

"ష్... కలా...?" లేచికూచుని కలుక్కుమన్న నడుం పట్టుకొన్నాడు. "కల కాకపోతే 'సిరి'యా నీకు దక్కేది" అంతరాత్మ వెక్కిరించింది. అనిరుధ్ ఆలోచనలో పడిపోయేడు. 'నిజమే – సిరి – ఎందుకలా...?' తనని తాను ప్రశ్నించుకొంటూనే సిరి బెడ్‌కేసి చూశాడు. ఎపుడో వెళ్లిపోయినట్టుంది. ఖాళీ బెడ్ కనిపించడంతో మనసునిండా సముద్రమంత నిరాశ ఆవహించింది.

పెళ్లయి నెల దాటుతున్నా ఎవరి బెడ్ వారిదే! కనీసం శోభనం రోజుకూడా దగ్గరకు రానీయలేదు – ఇక మామూలు రోజుల్లో అయితే స్పర్శకూడా చిక్కనీయడంలేదు...!

ఉన్నట్టుండి సెల్ మోగింది! నెంబర్ చూశాడు – సుధీర్! సుధీర్ అంటే నిజానికి సుప్రజ! సుప్రజంటే అనిరుధ్ కోలీగ్ – హాట్టి కోతి! చాలా కలివిడి మనిషి. సెన్సెక్స్ నుండి సెక్స్ దాకా అన్ని విషయాలూ దొర్లుతాయి ఆమె మాటల్లో! అయితే మొరాలిటీ విషయానికొస్తే మాత్రం వేలెత్తి చూపలేని క్యారెక్టర్. కానీ ఆ విషయం ఎంతమంది అర్థం చేసుకొంటారు? అందుకే ఆమెతో స్నేహాన్ని అతడు ఎవరితో చెప్పుకోడు. చెప్పుకొంటే గన్‌షాట్‌గా అపార్థం చేసుకొంటారు. ఆ కారణంగానే ఆమె పేరుని సుధీర్‌గా మార్చి ఫీడ్ చేసుకొన్నాడు. అయితే ఒక్కటి మాత్రం నిజం! సుప్రజతో మాట్లాడని రోజు

**చొప్పదండి సుధాకర్**

అతడికి ఏదో వెలితిగా అనిపిస్తూంటుంది. అందుకే ఈ ఏర్పాటు. ఎవరు అర్థం చేసుకొన్నా, చేసుకోకపోయినా అతడికి ఆమె నచ్చుతుంది... అంతే! వాళ్లిద్దరి మధ్య బంధం కూడా అంతే! అంతకుమించి ఏం లేదు...!

"హాయ్!" కాల్ అందుకొన్నాడు అనిరుధ్.

"ఏమిటోయ్ కొత్త పెళ్లికొడకా! డిస్టర్బెన్సా...?" అటునుండి సుప్రజ.

"ఏయ్ స్టుపిడ్! ఏమిటీ పొద్దునే ఫోన్ చేశావ్"

"ముందిది తెల్చు... ఏమిటీ... వాతావరణం కబుర్లు..."

"ఇడియట్...! ఏం లేదే...?" ఆమె మాటల్లో శ్లేష అర్థమయి అతడి మోము ఎర్రబారింది.

"కొయ్... కొయ్... క్షణం తీరికలేదు కదూ...!" కిసుక్కున నవ్వింది ఫోన్లోనే.


"ఏయ్ సుప్పీ! తల్లో బాంబు పెట్టి పేల్చేస్తా! నువ్వనుకుంటున్నదేం లేదుగానీ... ఇంత పొద్దునే ఫోనెందుకు చేశావ్! ముందు అది చెప్పు" కసురుకొన్నాడు అనిరుధ్.

"ఏం లేదా? - సర్లే నమ్మాం - ఇంతకూ ఎక్కడున్నావ్ - అత్తవారింట్లోనా - హైదరాబాద్‌లోనా...?" ఆరా తీసింది సుప్రజ.

"హైదరాబాద్‌లోనే - నిన్నే వచ్చాం... విషయమేమిటీ?

"హైదరాబాద్ వచ్చేశారా - హనీమూన్ వెళ్లలేదా...?"

"ఆ... హైదరాబాద్‌లోనే హనీమూన్...!



శ్రీ త్యాగరాయగానసభ, హైదరాబాద్‌లో జీనియస్ సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో జరిగిన సభలో 'జీనియస్ సాహితీ పురస్కారాన్ని అందుకుంటున్న అద్దేపల్లి. చిత్రంలో జి. రాధాకృష్ణ. కళా వేంకట దీక్షితులు, రత్నాకర్ బి. జయరాములు, ఎస్వీ రామారావు, పి. విద్యానాథ్. వెలుదండ నిత్యానందరావు ఉన్నారు.

తోడుగా మా బామ్మకూడా ఉంది. మాట్లాడతావా బామ్మతో..." అతడి గొంతులో పట్టరాని కోపం ధ్వనించింది.

"బాగా మాట్లాడుతుందా- మీ బామ్మ - ఫోనివ్వు ఓసారి...!"

"ఆ... బాగా మాట్లాడుతుంది. రోజూ పురాణాలు, కావ్యాలు తెగచదివేస్తూ - నన్నూ చదవమని పోరు పెడుతూంటుంది" బామ్మ రత్నం గుర్తొచ్చి చిటపటలాడేడు.

"ఎందుకట...?

అందులోనే అన్నీ ఉన్నాయని ఆమె నమ్మకం!" విసుగ్గా అన్నాడు అనిరుధ్.

"అంతే...?" సాగదీసి సంభాషణ పొడిగించింది సుప్రజ.

"సెల్ఫ్‌డెవలప్‌మెంట్ - సెక్స్ - లైఫ్‌స్కిల్స్ - జనరల్ అవేర్‌నెస్ అన్నీ ఉన్నాయనీ రోజుకు వందసార్లయినా వల్లెవేస్తూ నన్నూ కావ్యాలు చదవరా - అంటూ వేపుకు తింటుందనుకో...?" ఉసూరన్నాడు.

"పోనీ చదవలేకపోయావా...?" ఉచిత సలహాతో ఉడికించింది.

"నీ తలకాయ... ఏంటీ పొద్దున్నే తీరిగ్గా సోదిమొదలెట్టావ్ - విషయమేమిటో చెప్పిచావు - లేదంటే ఫోన్ కట్ చేసేస్తా...." మరోసారి మండిపడ్డాడు.

"చెబ్తా...చెబ్తా... ఇవాళ ఆఫీస్‌కి వొస్తున్నావుగా"

"ఎందుకు రానూ... వస్తాను" ఆఫీసు గుర్తుకు రాగానే ఢీలాపడిపోయేడు.

"అదేమిటోయ్ - అట్లా నీరసపడిపోతావ్ - దేశంలోనే నెంబర్ వన్ కార్పొరేట్ ఆఫీసులో బ్రాంచి మేనేజరివి - నెలకు ముప్పయి వేల జీతం - క్వాలిఫికేషన్ ఎమ్.బి.ఎ., ఇంకా - అదీ - నువ్వంటే ఆడపిల్లలకు చెప్పరాని క్రేజ్- "అతని నుతింప శక్యమే జయంతుని తమ్ముడు సోయగమ్మునన్" అన్నట్టు అందగాడివి... ఇంకా..." చివరగా ఆమె నవ్వు ఆపుకొంటున్నట్టు స్పష్టంగా అర్థమయింది అతడికి.

ఇక ఆ వాగుడికి అడ్డూ అదుపూ ఉండదని తెలిసి ఫోన్ కట్ చేశాడు.

నిజమే - అనిరుధ్ ఆడపిల్లల కలల రాకుమారుడే! తోడుగా మంచి ఉద్యోగం. రాజాలాంటి జీవితం! కానీ ఇదంతా నాణేనికి ఒకవైపే - రెండోవైపు పరిస్థితి వేరు. ఎందుకో తెలియదు గానీ - అతడి భార్య 'సిరి' అతడిని శోభనం రోజునే తిరస్కరించింది. కారణం చాలా విచిత్రమైంది. 'ఇంతటి అందగాడివి - పెళ్లికిముందు అమ్మాయిలను ప్రేమించడమో లేదా వారిచే ప్రేమించబడడమో ఖచ్చితంగా జరిగి ఉంటుందనే శంకతో. కాదని ఎంత చెప్పినా నమ్మలేదు సరికదా! కనీసం ముట్టుకోనీయలేదు. ఆ విషయమేదో స్పష్టంగా తేలేదాకా అంతే సంగతులు' అన్నట్టు - ఈ రోజుదాకా ఇరువురి మధ్యా మాగ్జిమమ్ డిస్టెన్స్ మెయింటెయిన్ చేస్తోంది...!

"ఏరా - ఎవరితో మాట్లాడుతున్నావ్?" తలుపు దగ్గర వినిపించిన రత్నం బామ్మ గొంతుకి ఈలోకంలోకి వచ్చి పడ్డాడు అనిరుధ్.

"ఎవరితో లేదు లేవే..." సంభాషణ కట్ చేశాడు. అయితే ఆవిడ వొదల్లేదు. ఎవరితో లేకపోవడమేమిట్రా! ఎవరో ఆడపిల్ల గొంతు వినిపిస్తేనూ" నిలదీసింది.

అనిరుధ్ ఆశ్చర్యపోయాడు. ఎంతయినా బామ్మ అసాధ్యురాలు! ఎనభై ఏళ్ల వయసులోని అనుభవమంతా రంగరించి ఆలోచిస్తుంది. ఆమె అంచనా ఎపుడూ గురితప్పదు.

"ఆడపిల్లలేదూ - కోడిపిల్లలేదూ -" కోపం

గా అంటూ బాత్‌రూం వైపు నడిచాడు.

"అన్నింటికీ కసురుకొంటావేంట్రా బడుద్ధాయ్! జీవితాన్ని అవగతం చేసుకోవాలంటే...

ఆమె మాటలింకా పూర్తికాకుండానే అనిరుధ్ అందుకుని – "కావ్యాలు భట్టీపట్టాలా..." అస్తమానం ఆమె చెప్పే డైలాగ్ గుర్తొచ్చి వ్యంగ్యంగా అన్నాడు.

అందుకు ప్రతిగా ఆమె నిశ్శబ్దంగా నవ్వింది.

"ఖచ్చితంగా చదవాల్రా శుంఠా...! వాటిల్లో ఉన్న సారాంశం మరెందులోనూ లేదు మరీ"

"సర్లే... చెప్పొచ్చావ్‌గానీ – అయితే ఇది చెప్పు – నా భార్య 'సిరి' నాతో ఎందుకు సరిగా ఉండడంలేదు" నిలదీశాడు.

"దానికి కూడా సమాధానం కావ్యాల్లోనే ఉంటుంది నాయనా..." దీర్ఘంతీసింది. అనిరుధ్‌కి అరికాలిమంట నెత్తికెక్కింది!

"మళ్లీ మాట్లాడావంటే... నిన్ను చంపేస్తాను... అయినా నిన్నడగడం నాదే బుద్ధి తక్కువ... అది పోనీ... సిరి ఎక్కడికి వెళ్లింది?"

"పక్కింటి అనసూయమ్మతో గుడికి వెళ్లింది..." తాపీగా బదులిచ్చింది రత్నం.

"ఆహా భక్తికేం కొదవలేదు" తనలో తాను గొణుక్కొంటూ బాత్‌రూంలో దూరాడు.

ఆఫీసునుంచి ఇంటికొస్తూనే అలసటగా సోఫాలో వాలిపోయాడు అనిరుధ్. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. సిరి లోపలెక్కడో ఉన్నట్టుంది. మొగుడిరాకను పట్టించుకోలేదు. గంటసేపు ఎదురుచూసినా, కాఫీ కాదుగదా! కనీసం పలకరింపు కూడా దొరకలేదు. అతడికి లోలోన మహా కోపంగా ఉంది. అయినా– నోరువిప్పితే వ్యవహారం మరింత చెడుతుందని తనని తాను నిగ్రహించుకొన్నాడు.

"ఏరా! ఆఫీసునుండి ఎపుడొచ్చావ్" రత్నం బామ్మ గొంతు వినిపించి కళ్లు తెరిచాడు.

"ఎపుడొచ్చానో నాకే తెలియదు... అంటే అంత టైం గడిచి పోయిందన్నమాట! ఇంతకూ 'సిరి'... అదే దొరసాని గారేరీ?" అడగడంలో వెటకారం ధ్వనించింది.

"పక్క వీధిలో పేరంటానికెళ్లిందిరా – రాత్రి ఎనిమిదిదాకా రాదు"

"ఎనిమిది తర్వాత మాత్రం ఎందుకూ?" పళ్లునూరాడు.

"ఒరే వెధవా – అట్లా కోపగించుకొంటే ఎట్లారా – అసలే చిన్నపిల్ల..."

"ఏం చిన్నపిల్ల... గ్రాడ్యుయేషన్ అయిపోయింది. నువు దాన్ని వెనకేసుకు రాకు – అసలు దానికి మొగుడంటే లెక్కలేదు" తిక్కగా అన్నాడు.


"నీ తలకాయ్ – అసలు తప్పంతా నీది" ఉన్నట్టుండి నిందవేసింది.

ఆ మాటతో అనిరుధ్‌కి చిర్రెత్తుకొచ్చింది. అయినా బామ్మను తిట్టడం బాగుండదని తమాయించుకొని –

"నా తప్పెట్లా అవుతుందే బామ్మా – నీమీదొట్టు. సిరే నన్ను అవమానిస్తోంది. ఇంత వరకూ నేను తనను ఒక్కటంటే ఒక్క మాట కూడా అన్లేదు" నెమ్మదిగా అన్నాడు.

"వొట్టి వెధవ్వి నువ్వు... ముందు నే చెప్పినట్టు చెయ్ – అట్లా వర్కవుట్ కాకపోతే... అపుడడుగు..." ధీమాగా అంది.

ఆ తర్వాత ఆమె చెప్పినదంతా పదినిమిషా




లు శ్రద్ధగా విన్నాడు అనిరుధ్.

"ఏమిటట్లా చూస్తున్నారు?" కన్నార్పకుండా తననే చూస్తున్న మొగుడి వింతవైఖరికి విస్తుపోతూ అడిగింది సిరి.

అప్పుడామె తలలో మల్లెదండ తురుముకొంటోంది!

"సిరీ - డోంట్ డిస్టర్బ్ మీ..." మిల్లీమీటర్ కూడా దృష్టిని ఆమె మీదినుండి మరల్చకుండా తన్మయంగా అన్నాడు అనిరుధ్.

"ఏం చేస్తున్నారనీ - డిస్టర్బ్ చేయొద్దంటున్నారు?"

"ఏం చేయకపోవడమేమిటీ? అతి ముఖ్యమైన పనిమీద ఉన్నాను. నీ అందం చూస్తున్నాను."

"ఊ - అంతా వుత్తిదే" అతడి చూపులకే కందిపోతూ తలదించుకొంది.

"ఏయ్, తలదించుకోకు చంపేస్తా - సిరీ - అసలు నువు ఇంత అందంగా ఎట్లా పుట్టి ఉంటావ్... రియల్లీ అమేజింగ్ అండ్ అన్‌బీలివబుల్ - నిన్ను చూస్తుంటే - నాకు కలో, నిజమో తెలియడం లేదు. అసలు నువు నా భార్య కావడం... నా పూర్వజన్మ - కాదు - కాదు- ఏడేడు జన్మల పుణ్యఫలం" ఆమె మోముని అపురూపంగా చేతుల్లోకి తీసుకొన్నాడు.

ఎందుకోగానీ... ఎప్పట్లా మొగుడిని తిరస్కరించలేకపోయింది. ఏదో కొత్తదనం - ఇంకేదో అపురూపమైన పురస్కారం పొందుతున్న అనుభూతి - వీటన్నింటినీ డామినేట్ చేస్తూ లోలోంచి పొంగుకొస్తున్న ఉద్వేగం...!

"ఏం కాదు - మీరే మహా అందగాళ్లు... మీముందు నేనెంత? మీరు చిటికేస్తే - ఆడపిల్లలు అట్లావొచ్చి ఇట్లా వాళ్లో వాలతారు" ఊపిరి ఉన్మాదంలో కొట్టుకుపోతూ ఇక తాళలేక మొగుడిని అంటుకుపోయింది.

"ఇటువంటి దేవలోక పారిజాతాన్ని అందు

కొమ్మని దేవుడు నా నుదుటన రాసిపెడితే నేను వొట్టి గడ్డిపూల వెంట పడిపోతాననీ... పోయాననీ... ఎట్లా అనుకొన్నావ్..." తమకంగా 'సిరి'ని ముద్దాడి అన్నాడు.

"అంతే..." కళ్లు గండు మీనాలై తళతళలాడాయి.

"సిరీ - కోహినూర్ వజ్రం ప్రపంచంలో ఒక్కటే ఉంది! నువు అచ్చంగా అటువంటి అద్వితీయానివే - ఒక్కనిజం చెబుతాను నమ్మగలవా...? నిన్ను పోలిన అందగత్తె నాకు ఇంతవరకూ కనీసం ఎదురుపడలేదు - ప్రామిస్" సిరి పెదాలు అందుకొన్నాడు.

"ఊ... మాటలు నేర్చారు - ఇన్నాళ్లెక్కడికి పోయిందీ బుద్ధీ" అతడి వెచ్చని స్పర్శకు నవనీతంలా కరిగిపోతూ ఆడనాగై అల్లుకు పోయింది. దాదాపుగా ఎవరు ఎవరో తెలియని ఏకైక దేహంతో ఆవేశంగా - ఆనందంగా - ఉల్లాసంగా - ఉన్మత్తంగా ఒకరిలో ఒకరు లీనమైపోయారు - ఆ రాత్రికిక గత్యంతరం లేక 'శివరాత్రే' అయింది.

* * *

ఆ మధుర సమాగమానికి ఆరేడు గంటల ముందు... హాల్లో జరిగిన సంభాషణ...

"ఒరేయ్ చవటా! కావ్యాలు చదవరా - పురాణాలు చదవరా అన్నప్పుడల్లా కసురుకొంటావ్ గానీ - ఒక్కసారన్నా ఎందుకే బామ్మా అని అడిగావా?" రత్నం బామ్మ మనవడు అనిరుధ్‌ని ముద్దుగా మందలించింది. కాసేపు అతడు ఏం మాట్లాడలేదు.

"పోనీ ఇపుడడుగుతున్నా చెప్పవే - ఎందుకనీ" కొద్దిసేపటికి శాంతించి అన్నాడు. బామ్మ గొంతు సవరించుకొంది.



'పూలరేకులు' నానీల సంపుటి ఆవిష్కరణ సందర్భంగా భావతరంగిణి దశమ వార్షికోత్సవ వేదికపై కవయిత్రి కోపూరి పుష్పాదేవి, సమీక్షకులు విడియాల చక్రవర్తి, కె. జయరావు, ఆలపాటి జనార్ధనరావు, కౌతవరపు శివరామకుమార్.

"కావ్యాల్లో స్త్రీలు అష్టవిధనాయికలు - అందులో ఒక విధం - కలహాంతరిత"

"కలహాంతరితా - అంటే ఏమిటే?" ఆసక్తిగా అడిగాడు.

"అదే కదా చెప్పబోయేది - కలహాంతరిత అంటే మొగుడితో పైకి ఎంతగా పోట్లాడుతుందో - లోలోన అంతగా ప్రేమించేదన్న మాట! ఆ పోట్లాట సారాంశం ఏమిటంటే మొగుడనేవాడు తననే పొగడాలనీ - తన చుట్టే తిరుగుతూ - తన తోడినే లోకంగా ఉండాలన్న బలీయమైన ఆకాంక్ష - అది చెప్పలేకే ఈ తండ్లాట".

"అయితే ఏమిటే నీ తలకాయ?" దానికీ దీనికీ లింకేమిటీ అన్నట్టుగా ప్రశ్నించాడు.

"అయితే ఏమిటా - అక్కడే ఉంది అసలు కిటుకు - నీ భార్య - అదే సిరి కలహాంతరితరా - మొద్దు సన్నాసీ" మురిపెంగా చెప్పింది బామ్మ.

"ఆ..." నోరెళ్లబెట్టాడు అనిరుధ్.

"అదీ అసలు సంగతి! అది తెలియక నువు తెలివితక్కువగా నా భార్య నన్ను దగ్గరకు రానివ్వడం లేదో - అని అలిగి కూర్చున్నావ్. కొంత మంది ప్రవర్తన విచిత్రంగా ఉంటుంది. వాళ్లకి ఎంత ఆకలిగా ఉన్నా ఎవరో ఒకరు బతిమాలడమో - అదీ ఇదీ కాకపోతే కనీసం 'భోంచేద్దు గాని రా...!' అనేంతవరకూ కదలరు. వారి ప్రాధాన్యత ఎంత ఉందో తెల్సుకోవడానికి అనుక్షణం పరిస్థితి బేరీజు వేసుకొంటూ మసలుకొంటుంటారు. వాళ్లకదో సరదా! అటువంటి వారిని, వారి ప్రవర్తన గుర్తెరిగి మనమే సర్దుకుపోవాలి... అయినా ఢిల్లీ మనదగ్గరకు రానపుడు మనమే ఢిల్లీ దగ్గరకు వెళ్లడంలో తప్పేమిట్రా - "ధర్మసూక్ష్మం వివరించింది బామ్మ".

ఆమె విషయ పరిజ్ఞానానికి డంగైపోయాడు అనిరుధ్. కొద్దిసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు షాక్‌తో...! తరువాత తేరుకొని -

"హారి నీ అసాధ్యం కూలిపోనూ - ముసిల్దానా! నీకెలా తెల్సే ఇవన్నీ..."

"చెప్పాను కదరా - కావ్యపఠనం చేయాలనీ - అందులో నాయికా వర్ణన ఉంటుందనీ"

"చంపావే - ఇంతే కదా..."

"ఇంతే అంటే - ఇంకా వుందనుకో" మూతి బిగించింది బామ్మ.

"ఇంకా వుందా - ఏమిటో ఆ బ్రహ్మ రహస్యం..."

"రహస్యమంటే - రహస్యమే" ఆమె నవ్వు ఆపుకొంటున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

"ఆ కాస్తా కూడా విప్పవే బామ్మా - సస్పెన్స్ భరించలేను" వేగిరపడిపోయాడు.

"నీలాగే మీ తాత కూడా - అసలు విషయం తెలియక మొదట్లో నాతో అంటీ ముట్టనట్టు ఉండేవాడు..."

"అంటే నీదీ ఈ బాపతు కేసేనా...?" థ్రిల్లయ్యాడు.

"ఔన్రా మనవడా - వయసులో ఉండగా నేనూ కలహాంతరితనే"

"ఆ... నువ్వెక్కడి పిశాచానివే బామ్మా" అనిరుధ్ నోరు తెరచుకొని అట్లాగే ఉండిపోయాడు.

బామ్మ మాత్రం ఆ రాత్రి అనిరుధ్, సిరిల బెడ్ అలంకరించడానికి లోనికి వెళ్లిపోయింది.

అదీ కొత్త దంపతుల అరుదైన సంగమానికి రత్నం బామ్మ సమకూర్చిన స్క్రీన్‌ప్లే....! ●